క్లుప్తంగా

మండల పరిషత్ సమావేశం నేడు

ఇచ్ఛాపురం రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరవ్వాలని కోరారు.

కవిటి: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎల్.త్రినాథ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారాన్ని, ప్రగతి నివేదికలను రెండుసెట్లు ముందస్తుగా సమర్పించి ఈ సమావేశానికి విధిగా హాజరుకావాలని స్పష్టం చేశారు.

540 మందికి కంటి వైద్య పరీక్షలు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని పూండిలో ఉన్న సాయి వినీత్ విద్యాసంస్థలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 540 మంది విద్యార్థులకు కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ షీలా వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 139 మంది విద్యార్థులు పలు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కాగా ప్రతి ఒక్కరూ కంటి సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. తాజా కూరగాయలు, ఆకు కూరలు ఆహారంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతిపత్రం అందజేత

పలాస: పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీలోని అన్ని సచివాలయాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎస్.రామారావుకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ సమానంగా పదోన్నతుల జాబితాను రూపొందించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చక్రధర్, తేజ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం రూరల్: భారత రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను విజయవంతం చేయాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు సల్ల దేవరాజు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా, క్రిమిలేయర్ రద్దు చేయాలని, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ కుప్పం నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఇచ్ఛాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు శుక్రవారం చేరుకుంటుందన్నారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాలకు చెందిన దళితులు హాజరవ్వాలని కోరారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు శుభరాట



శుభరాట వేస్తున్న మహిళా భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టిలో నిర్వహించనున్న దేవి శరన్నవరాత్రులకు గురువారం శుభరాట వేశారు. దేవీ నవరాత్రుల ఉత్సవాలను గ్రామంలో తొలిసారిగా ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో భవానీ మాలధారణలతో ఉత్సవాల ఏర్పాట్లు ప్రారంభిస్తామని వెల్లడించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని ఇసకలపాలేం ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను పాఠశాల ఆవరణలో గురువారం సన్మానించారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తూ జి.ధర్మారావు, మురళీకృష్ణ, దున్న రవికుమార్ ఇటీవల బదిలీపై వెళ్లారు. దీంతో వారి సేవలను కొనియాడుతూ హెచ్ఎం ఎం.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు ఆసరా..!

- వరిలో జింక్ లోపంతో ఇబ్బందులు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- లోప నివారణకు అధికారుల సూచనలు



పంటపొలం

సోంపేట:

ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్న రైతులు పంటలో తగిన జాగ్రత్తలు తీసుకొని, పంట ఎదుగుదలకు తగిన పోషకాలు అందజేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం పంటల సాగులో సేంద్రియ ఎరువుల వినియోగం తగ్గిపోతుండడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. రసాయనిక ఎరువుల్లో నత్రజని, భాస్వరం, పొటాష్ ఉండగా.. సూక్ష్మ పోషకాలు లేకుండా ఉంటాయి. దీంతో దీర్ఘకాలికంగా రసాయనిక ఎరువులపై ఆధారపడి సాగు చేసే నేలల్లో సూక్ష్మపోషకాల లోపాలు ఏర్పడుతాయి. వాస్తవానికి పంటకు తక్కువ పరిమాణంలో అవసరమయ్యే జింక్, బోరాన్, మెగ్నీషియం వంటి సూక్ష్మ పోషకాలు పంట ఎదుగుదలకు, మంచి దిగుబడులకు దోహదపడుతాయి. వరిపంటలో ఏర్పడే ముఖ్యమైన జింక్‌లోప నివారణకు వ్యవసాయాధికారులు రైతులకు సలహాలు అందజేస్తున్నారు.

జింక్ లోపానికి కారణాలు

వరిలో జింకులోపం అధికంగా రావడానికి కారణం సేంద్రియ ఎరువులు తక్కువగా వాడడమే. కొంత మంది రైతులు పచ్చిరొట్ట ఎరువులు వేసినా పశువుల గెత్తం వేయరు. మరి కొంతమంది రైతులు రసాయన ఎరువులతోనే పంటలు సాగు చేస్తుంటారు. వరి సాగు చేసే నేలల్లో చౌడు ఉన్నా జింక్ లోపం వస్తుంది. మురుగునీరు సరిగా బయటకు వెళ్లని నేలల్లో సాగు చేసినప్పుడు, వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు కూడా వరిలో జింకు లోపం కనిపిస్తుంది.

దిగుబడులపై ప్రభావం

పంటలో జింకు లోపం ఉంటే రసాయన ఎరువులు తీసుకునే శక్తి తగ్గిపోయి వేసిన ఎరువులు వృథా అయిపోతాయి. వరిలో వచ్చే జింకులోపం పంట పెరుగుదల, దిగుబడులపై ప్రభావం చూపుతుంది. జింకులోపం ఉన్నప్పుడు నాటిన వరిపైరు అనారోగ్యంగా కనిపిస్తుంది. పిలకలు తక్కువగా ఆలస్యంగా వస్తాయి. పిలకలు సరిగా పెరగక పంటలో ఎదుగుదల లోపిస్తుంది. జింకులోపం తీవ్రంగా ఉన్న చోట అడుగు ఆకులు ఎండిపోతాయి. పైరు పెరుగుదలకు ఇబ్బందులు కలిగి పంటలో దిగుబడులు తగ్గిపోతాయి. జింక్ లోపం ప్రతిఏటా పెరుగుతూ పోతుంది. దిగుబడులు పెంచుకోవడానికి సరైన జింక్ పోషక యాజమాన్యాన్ని పాటించాలి.

నివారణ చర్యలు

జింక్ లోపం నివారణకు పంటకు అవసరమైన పోషకాల్లో కనీసం 30 శాతం సేంద్రియ ఎరువుల ద్వారా అందజేయాలి. పశువుల ఎరువు వేయడంతో పాటు పచ్చిరొట్ట సాగు చేయాలి. సేంద్రియ ఎరువులు వినియోగించని వారు జింకులోప నివారణకు వరి నాటడానికి ముందు ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ దమ్ములో వేసుకోవాలి. జింక్ సల్ఫేట్ ఎరువు వేసేటప్పుడు భాస్వరం ఎరువులతో కలిపి వేయకూడదు. జింక్ సల్ఫేట్ వేయడానికి ముందు, తర్వాత నాలుగు రోజులు రసాయన ఎరువులు వేయరాదు. జింక్ లోపం నివారణ చర్యలు తీసుకోకపోతే పంటలో దిగుబడులు తగ్గుతాయి.

సూచనలు పాటించాలి



ఖరీఫ్ వరిసాగులో జింక్ లోపిస్తే పంట దిగుబడులపై ప్రభావం చూపిస్తుంది. రైతులు తమ పొలంలో జింక్ లోపించినట్లు గుర్తిస్తే స్థానిక వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలి. పంటను పరిశీలించే వ్యవసాయాధికారుల సలహాలు సూచనలు పాటించాలి. జింక్ లోపం నివారించుకుంటే పంట పెరుగుదల రావడంతో పాటు దిగుబడులు పెరుగుతాయి.

– బి.నర్సింహమూర్తి, వ్యవసాయాధికారి, సోంపేట

టీడీపీ నాయకుల వ్యాఖ్యలు దురదృష్టకరం

టెక్కలి:

ఒక వైపు యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతుంటే, మరోవైపు టెక్కలి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు రైతులను కించపరిచే విధంగా ఉండడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ టెక్కలి మండల అధ్యక్షుడు హనుమంతు వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి సత్తారు సత్యం, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్నిక జీవన్‌లు మండిపడ్డారు. గురువారం టెక్కలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమంపై టీడీపీ నాయకులు చేస్తున్న విమర్శలు అర్థరహితంగా ఉన్నాయన్నారు. యూరియా కోసం రైతులు క్యూలు కట్టి ఇబ్బందులు పడుతున్న విషయం వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. యూరియా పంపిణీ చేయడం చేతకాని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రైతులకు ఉచిత సలహాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. యూరియా వాడకం తగ్గించాలని, యూరియా వాడకం తగ్గించిన రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తామని ప్రకటనలు చేయడం ఆయన అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు. వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించిన ప్రకారం యూరియా అందని రైతులకు ప్రోత్సాహకాలు అందజేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస గ్రామంలో గురువారం ఒక లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి నుంచి రావివలస వైపు వెళ్తున్న లారీ, రావివలస సమీపంలోకి వెళ్లేసరికి రోడ్డు పక్కగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని అదుపు తప్పి ఢీకొంది. దీంతో ఆ స్తంభం రెండుగా విరిగిపోవడంతో విద్యుత్ వైర్లు కొన్ని తెగిపోయాయి. అనంతరం విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీపై అవగాహన అవసరమని జిల్లా హెల్త్ కో–ఆర్డినేటర్ రవికుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, లేకపోతే వారి భవిష్యత్ నాశనమవుతుందని హెచ్చరించారు. అనంతరం హెచ్ఐవీపై అవగాహన కల్పించే పోస్టర్‌ని విడుదల చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సూర్యారావు, ఉపాధ్యాయ సిబ్బంది కామరాజు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామారావు మృతి పార్టీకి తీరని లోటు

వజ్రపుకొత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ పిట్ట రామారావు మృతి పార్టీకి తీరని లోటు అని మందస మండల ఎంపీపీ డొక్కరి దానయ్య, పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాజాంలో గురువారం రామారావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ రామారావు చిన్న వయస్సులోనే అనేక పోరాటాలు చేశారని, అనంతరం రాజకీయ ప్రవేశం చేసి సర్పంచ్‌గా గ్రామానికి సేవలు అందించారని కొనియాడారు. అలాగే వైఎస్సార్‌సీపీలో చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీని పరిసర గ్రామాల్లో మరింత బలోపేతం చేశారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళ కార్యదర్శి బద్రి సీతమ్మ యాదవ్, పార్టీ పలాస నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఇరోతు హేమంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు తమ్మినాన శాంతారావు, ఈశ్వరరావు, సర్పంచ్‌లు పిట్ట గీతారాణి, గూడ గిరిజ, జోగారావు, జోగి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సంతాపం తెలుపుతున్న పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు

ఆదమరిస్తే అంతే..!

- జంగిల్ క్లియరెన్స్ చేపట్టని ఆర్అండ్‌బీ అధికారులు
- వాహనదారుల అవస్థలు



పర్రిపుట్టుగ కూడలి మలుపు వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రద్దీగా ఉండే రోడ్డు మార్గాల్లో ఆదివారం సంత నుంచి బి.గొనపపుట్టుగ గ్రామం వరకు ఉన్న రోడ్డు మార్గం ఒకటి. ఈ రోడ్డు మార్గంలో కవిటి, కంచిలి మండలాలకు చెందిన ప్రజలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు జాతీయ రహదారి నుంచి ఆదివారం సంత కూడలి వద్ద మకరాపురం గ్రామం మీదుగా సాలినపుట్టుగ, పర్రిపుట్టుగ, పర్రిపుట్టుగ కాలనీ, శమళ్లపుట్టుగ, నర్సుపుట్టుగ తదితర గ్రామాల మీదుగా బి.గొనపపుట్టుగ నుంచి ప్రయాణాలు చేస్తుంటారు. ఈ రోడ్డు మార్గంలో ఎక్కువగా మలుపులు ఉంటాయి. దీంతో ఎప్పటికప్పుడు రోడ్డుకి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాల్సి ఉంటుంది. వర్షాలు కురిసిన తర్వాత తప్పనిసరిగా ఈ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఈ రోడ్డు మార్గంలో చాలా వరకు ఇరువైపులా ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగాయి. ఫలితంగా మలుపుల వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనపడని పరిస్థితి. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కానీ ఇంతటి ప్రాధాన్యమైన రహదారి మార్గంలో ఆర్అండ్‌బీ అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు పది కిలోమీటర్లు ఉండే ఈ రోడ్డుమార్గంలో ఇప్పటికైనా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మకరాంపురం – సాలినపుట్టుగ గ్రామాల మధ్య రోడ్డు మలుపు వద్ద పరిస్థితి



నర్సుపుట్టుగ – పర్రిపుట్టుగ గ్రామాల మధ్య రోడ్డు పక్కన పెరిగిన పిచ్చిమొక్కలు

అవస్థలు వర్ణనాతీతం



కంచిలి, కవిటి మండలాలను కలిపే జాతీయ రహదారి ఆదివారం సంత జంక్షన్ నుంచి బి.గొనపపుట్టుగ వరకు ఉన్నటువంటి ఆర్అండ్‌బీ రోడ్డు మార్గంలో జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడం వలన వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వెంటనే దీనిపై అధికారులు స్పందించాలి.

– వజ్జ మృత్యుంజయరావు, వైఎస్సార్‌సీపీ కంచిలి మండల అధ్యక్షుడు, మకరాంపురం

ప్రమాదాలను నివారించాలి



రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టని కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు మండలాల ప్రజల ప్రయాణ అవసరాలు తీర్చుతున్న ఈ రోడ్డు మార్గంపైన వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేపట్టి, ప్రమాదాలు నివారించాలి.

– బెందాళం రమణ, షిరిడీ సాయి ఆలయ ట్రస్టీ, మకరాంపురం

అధ్వానం



ఈ చిత్రం చూసి మురుగునీటి కాలువ అనుకుంటే పొరపాటు పడినట్లే. బడికి, గుడికి, ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పరిస్థితి ఇది. ఇచ్ఛాపురం రూరల్ మండలంలోని కొళిగాం గ్రామం శివాలయం ఎదురుగా ఉన్న ఈ ఆర్అండ్‌బీ రోడ్డు గతేడాది నుంచి మరమ్మతులకు నోచుకోకపోవడంతో బురదకుంటగా మారింది. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినప్పటికీ ఫలితం కనిపించడం లేదని ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

ఆటో కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలి



టెక్కలి: ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్న ఆటో డ్రైవర్లు



పలాస: ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న దృశ్యం

పలాస: రెక్కల కష్టం మీద బతుకుతున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం ఉపాధి భద్రత కల్పించాలని ఆటో కార్మికుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఆటో కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ఏడాదికి రూ.30 వేలు ఇచ్చి ఆదుకోవాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోలు ధరలు, ఇన్సూరెన్స్ ప్రీమియం, ఆర్డీవో చలానాలు, టోల్ ఫీజులు, రోడ్డు ట్యాక్సులు పెరిగిపోవడం వలన ఆటోలను నడపడమే కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన ఆటో డ్రైవర్లను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవో జి.వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.చంద్రశేఖర్, వి.కృష్ణారావు, ఎం.ముకుంద, ఎం.తారావు, రేవంత్‌రెడ్డి, ఎస్.దిలీప్, జి.దుర్యోధన, కె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: ఉచిత బస్సు పథకం వలన తీవ్రంగా నష్టపోతున్న ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని టెక్కలి ఆర్డీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. ఉపాధి లేకపోవడం వలన ప్రైవేట్ ఫైనాన్సర్ల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసుకోవాల్సిన దుస్థితి దాపురించిందని సీఐటీయూ నాయకుడు ఎన్.షణ్ముఖరావు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జె.కృష్ణారావు, ఆర్.రమణ, బి.షణ్ముఖరావు, బి.రాజేష్, డి.శ్రీరామ్, ఆర్.డిల్లీ, డి.శ్యామలరావు, ఎస్.పాపారావు, పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పడిన ఉపాధ్యాయుల కొరత కారణంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోందని, ఈ సమస్యను అధిగమించేందుకు కొత్తగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. అలాగే ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టాలన్నారు. కవిటి మండలం దూగానపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో 59 మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే సోంపేట, బారువ మండలాల్లోని ఆస్పత్రుల్లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తిచేసి డయాలసిస్ పరికరాలను అందుబాటులోనికి తీసుకురావాలని విన్నవించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు నర్తు నరేంద్రయాదవ్, తడక జోగారావు తదితరులు ఉన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

మందస:

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా పిలుపునిచ్చిన నిరసన వారం కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు గురువారం మండలంలోని ఉపాధ్యాయులు పాఠశాల విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ కమిటీ నియామకం, ఐఆర్ ప్రకటన, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయడం వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సాయంత్రం 4.30 గంటలకు జరిగే ప్రదర్శనలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయుల పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కంచిలి: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ ప్రతినిధులు రెల్ల కామరాజు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కంచిలి, డోలగోవిందపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల వద్ద ఉపాధ్యాయులతో కలిసి గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మందస: జెడ్పీ హైస్కూల్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

టెక్కలి రూరల్: ఆర్థిక విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం కోటబొమ్మాళి ఎంఆర్సీ కార్యాలయం సమీపంలో రణభేరి పోస్టర్ అవిష్కరణ చేశారు. ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరుగు రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు వాసుదేవరావు, నారాయణరావు, సింహాచలం, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మందస: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహించనున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, మండల కార్యదర్శి దాసరి ఈశ్వరరావులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లహరిబంద, అంబుగాంలో పోస్టర్ ఆవిష్కరించారు.



రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

అధ్యక్షుడిగా డిల్లేశ్వరరావు

టెక్కలి: వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గం చేతివృత్తిదారుల విభాగానికి అధ్యక్షుడిగా టెక్కలికి చెందిన మిందబోయిన డిల్లేశ్వరరావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ప్రకటన విడుదల చేశారు. దీంతో ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.